కంప్యూటర్‌ను పుట్టించిందే రాజీవ్‌గాంధీ!

ఆయన కంప్యూటర్‌ను పరిచయం చేయకుంటే ఐటీ శాఖనే లేకపోవు

కేటీఆర్ ఐటీ మంత్రి కాకపోవు

రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : కంప్యూటర్‌ను పుట్టించిందే మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సెల్‌ఫోన్లు, కంప్యూటర్‌ను మన దేశానికి పరిచయం చేసింది ఆయనే అని, దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందని చెప్పారు. సచివాలయం ఎదుట ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహాన్ని సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ గాంధీల కుటుంబానిది త్యాగాల చరిత్ర అని కొనియాడారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి, పదేండ్లు జైలులో ఉన్నారని గుర్తుచేశారు. ప్రధానిగా 563 సంస్థానాలను దేశంలో విలీనం చేయించి దేశ సమగ్రతను కాపాడారని చెప్పారు. విద్య, సాగునీటి రంగాలను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని దేశ భవిష్యత్తుకు పునాదులు వేశారన్నారు. నెహ్రూ బతికి ఉండగా ఇందిరా గాంధీ ఏ పదవీ తీసుకోలేదని, ఆమె మరణం తర్వాత రాజీవ్ గాంధీ ప్రధాని అయ్యారని చెప్పారు. రాజీవ్ గాంధీ మరణించిన తర్వాత 2004–14 మధ్య సోనియా గాంధీ ఏ పదవీ తీసుకోలేదని గుర్తుచేశారు. 'రాజీవ్‌గాంధీ కంప్యూటర్‌ను పరిచయం చేయకపోయి ఉంటే ఐటీ శాఖ అనేదే లేకపోవు.. కేటీఆర్ ఐటీ శాఖ మంత్రే కాకపోవు..' అని పేర్కొన్నారు. సచివాలయంలో డిసెంబర్ 9లోగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని వివరించారు. కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అస్థిత్వంతో పెట్టుకుంటే రాజకీయ సమాధే

- కాంగ్రెస్ సర్కారు చర్యకు నేడు నిరసన
- తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు
- బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే సకల మర్యాదలతో గాంధీభవన్‌కు రాజీవ్ విగ్రహం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యే మాణిక్‌రావు, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు సంద్ర వెంకటవీరయ్య, బాల్క సుమన్, గాదరి కిశోర్, పార్టీ నేత రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): సచివాలయం, తెలంగాణ అమరజ్యోతి మధ్యలో ఉండాల్సిన తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టటంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది తెలంగాణ అస్తిత్వాన్ని తాకట్టు పెట్టే సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. రేవంత్‌రెడ్డి చర్యకు నిరసనగా మంగళవారం రాష్ట్రంలోని అన్ని తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ తల్లిని అవమానించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యను ఎక్కడికక్కడ పార్టీ శ్రేణులు సహా తెలంగాణ వాదులంతా వ్యతిరేకిస్తూ నిరసన తెలపాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఏమిటని తెలంగాణ సమాజం ఆవేదన వ్యక్తం చేస్తున్నదని తెలిపారు. చేసిన తప్పును రేవంత్‌రెడ్డి సరిదిద్దుకోవాలని సూచించారు. లేదంటే తెలంగాణ ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

గాంధీభవన్‌కు రాజీవ్ విగ్రహం తరలిస్తాం

కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టుకోవాలనుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే, తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టాల్సిన స్థలంలో రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్నే తాము వ్యతిరేకిస్తున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ సచివాలయం, అమరజ్యోతి మధ్యలో తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలని 2023 జూలైలోనే కేసీఆర్ ఈ స్థలాన్ని ఎంపిక చేశారని గుర్తుచేశారు. కేసీఆర్ ఎంపిక చేసిన స్థలానికి తెలంగాణ సమాజం యావత్తు ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కుసంస్కారంతో తెలంగాణ ఉద్యమానికి సంబంధంలేని వ్యక్తి విగ్రహాన్ని ఆ స్థలంలో ఏర్పాటు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తన చర్యతో తెలంగాణలోని ప్రతి వ్యక్తిని గాయపర్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగించి సకల మర్యాదలతో గాంధీభవన్‌కు తరలిస్తామని చెప్పారు.

తెలంగాణ ఆత్మను ఢిల్లీకి తాకట్టు పెడతారా?

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి ఢిల్లీకి బానిసత్వం చేస్తారని తాము ముందునుంచే చెప్పామని కేటీఆర్ గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి సరిగ్గా ఇప్పుడు అదే పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఢిల్లీ బాసుల మెప్పు కోసమే తెలంగాణను ఆత్మను తాకట్టు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు, తెలంగాణ మనోభావాల కన్నా ఢిల్లీ బాసుల మెప్పు పొందడమే కాంగ్రెస్‌కు పాలకులకు ముఖ్యమైపోయిందని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి చర్యను యావత్తు తెలంగాణ సమాజం చీదరించుకుంటున్నా సిగ్గు లేకుండా తెలంగాణ తల్లిని అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ అస్తిత్వంతో పెట్టుకుంటే..

తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ ప్రజల ప్రయోజనాల కన్నా కాంగ్రెస్ నాయకులకు స్వప్రయోజనాలే ముఖ్యమైపోయాయని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమకారులమంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ నాయకులంతా ఢిల్లీకి గులాములేనని తేలిపోయిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలా? ఢిల్లీ బాసులా? అంటే కాంగ్రెస్ నాయకులంతా ఢిల్లీ బాసులకే జీ హుజూర్ అంటారనే విషయం మరోసారి స్పష్టమైందని తెలిపారు. తెలంగాణ అస్తిత్వంతో పెట్టుకున్న వాళ్లెవరు రాజకీయంగా బతికి బట్టకట్టలేదని హెచ్చరించారు. మన ప్రాంతంవాడే మన అస్తిత్వతాన్ని దెబ్బ తీస్తుంటే తెలంగాణ ప్రజలు వారికి రాజకీయంగా సమాధి తవ్వడం ఖాయమని స్పష్టం చేశారు.

నేడు జాతీయ సమైక్యత వేడుకలు

హైదరాబాద్ సంస్థానం దేశంలో విలీనమైన సందర్భాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ సమైక్యత దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు హాజరవుతారు. మరోవైపు ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంతో వేడుకలు నిర్వహిస్తున్నది. పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవం పేరుతో పరేడ్ గ్రౌండ్స్‌లో వేడుకలు నిర్వహించనున్నది.

ఆర్ఆర్ ట్యాక్స్‌పై చర్యలేవీ

ఆర్ఆర్ ట్యాక్స్‌పై చర్యలు ఏమయ్యాయని ప్రధాని నరేంద్రమోదీని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నదని నాలుగు నెలల క్రితం ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేస్తూ ఎక్స్ వేదికగా నిలదీశారు. తెలుగులో తీసిన ట్రిపుల్ ఆర్ కలెక్షన్ల కన్నా 'డబుల్ ఆర్ ట్యాక్స్' కలెక్షన్ ఎక్కువ అయిందని ఆరోపించిన ప్రధాని ఆ ట్యాక్స్‌పై చర్యలు తీసుకునేందుకు ఎవరు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ పల్లెత్తు మాట ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

ఉచిత విద్యుత్తు అంటే ఇదేనా?

సూర్యాపేట జిల్లా మోతే మండలం మామిండ్లగూడెంలో 16 రోజులుగా విద్యుత్తు సరఫరా లేకపోవడంపై కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పనితీరుకు మామిండ్లగూడెంలో నెలకొన్న చీకటే సంకేతమని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్తుకు ఇది నిదర్శనమని ఎద్దేవా చేశారు. కనీసం ఇప్పటికైనా ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క కల్పించుకొని మామిండ్లగూడెం ప్రజల కరెంట్ కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు.

సిరికొండకు కేటీఆర్ శుభాకాంక్షలు

శాసనమండలిలో బీఆర్ఎస్‌పక్ష నేతను సిరికొండ మధుసూదనాచారికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ సిరికొండను శాసనమండలిలో విపక్షనేతగా గుర్తించాలని శాసనసభా కార్యదర్శికి పార్టీ అధినేత కేసీఆర్ గతంలో లేఖ రాయడం, అందుకు అనుగుణంగా గుర్తింపు ఇవ్వడం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్ నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సంద్ర వెంకటవీరయ్య, బాల్క సుమన్, గాదరి కిశోర్, పార్టీ నేత రాకేశ్‌రెడ్డి తదితరులు కేటీఆర్‌తో సమావేశం అయ్యారు. తాజా పరిణామాలపై చర్చించారు.

తెలంగాణకు బీఆర్ఎస్సే శ్రీరామ రక్ష

తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్ మాత్రమే రాజీలేని పోరాటం చేస్తుందని కేటీఆర్ తేల్చిచెప్పారు. ఢిల్లీ బాసుల మెప్పు కోసం కాకుండా తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ముందు నిలబడుతుందని తెలిపారు. ఎప్పటికైనా తెలంగాణకు బీఆర్ఎస్సే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు.

సలాం...కాళేశ్వరం

నమస్తే తెలంగాణ కథనాన్ని కేటీఆర్ ట్యాగ్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రైతన్నకు కాళేశ్వరం వెయ్యి ఏనుగుల బలం అని కేటీఆర్ పేర్కొన్నారు. 'నాడు..నేడు.. ఏనాడైనా తెలంగాణ రైతన్నకు వెయ్యి ఏనుగుల బలం కాళేశ్వరం. భారీ వరదలనే కాదు బురద రాజకీయాలను తట్టుకుని నిలబడిన కాళేశ్వరం ప్రాజెక్టుకు సలాం' అని ఆయన ఎక్స్ చేశారు. ఈ మేరకు 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన 'కూలిందెక్కడ? మింగిందెవరు?' అనే ప్రత్యేక కథనాన్ని ఆయన ఎక్స్‌వేదికగా ట్యాగ్ చేశారు. 'దశాబ్దాల సాగునీటి కష్టాలను తీర్చి అన్నదాతల కన్నీళ్లను తుడుస్తున్నందుకు యావత్ తెలంగాణ సమాజం పక్షాన కాళేశ్వరం ప్రాజెక్టుకు సెల్యూట్' అని పేర్కొన్నారు.

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	35.2°c	23.4°c
మెదక్	34.7°c	21.7°c
రంగారెడ్డి	33.0°c	21.6°c
ఖమ్మం	33.0°c	22.0°c
నిజామాబాద్	31.1°c	23.6°c
వరంగల్	31.0°c	24.0°c
కరీంనగర్	31.0°c	25.0°c
నల్లగొండ	31.0°c	24.0°c
మహబూబ్‌నగర్	30.3°c	22.1°c
హైదరాబాద్	30.2°c	23.5°c

రాష్ట్ర సచివాలయం వద్ద తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సిద్దిపేట జిల్లా పట్టణంలోని రంగధాంపల్లి అమరవీరుల స్థూపం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి, తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన బీఆర్ఎస్వీ నాయకులు

తెలంగాణ ఆత్మ.. ఢిల్లీకి తాకట్టు

- కేసీఆర్ ఆ ప్రాంతాన్ని పవిత్ర భూమిగా చేయాలనుకున్నరు
- తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు 2023 జూన్‌లోనే డిజైన్
- కేసీఆర్ నిర్మించారనే అంబేద్కర్ ఫొటో గ్యాలరీకి తాళం
- మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి మండిపాటు

తెలంగాణభవన్‌లో సోమవారం మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడమంటే తెలంగాణ తల్లిని అవమానించైనా సరే.. ఢిల్లీ బాస్‌లు, సోనియా మెప్పు పొందాలనే ఆతృత రేవంత్‌రెడ్డిలో కనిపిస్తున్నదని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకలైన బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం, తెలంగాణ అమరుల స్ఫూర్తికి ప్రతీక అయిన అమరజ్యోతి కట్టడం మధ్య లో తెలంగాణకు సంబంధమే లేని ఓ పార్టీకి చెందిన రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం శోచనీయమని విచారం వ్యక్తంచేశారు. తెలంగాణ మేధావులు, కవులు, కళాకారులు వద్దన్నా వినకుండా కేవలం తన ఢిల్లీ బాసులను ప్రసన్నం చేసుకునేందుకు తెలంగాణ ఆత్మను తాకట్టు పెట్టరని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డికి ఏనాడూ తెలంగాణ సోయి లేదని, అందుకే ఒక పార్టీ వ్యక్తి విగ్రహాన్ని సచివాలయం, అమరజ్యోతి మధ్య ఏర్పాటు చేస్తున్నారని ఆక్షేపించారు. బీఆర్ఎస్ నేతలు సోమ భరత్‌కుమార్, చిరుమల్ల రాకేశ్‌కుమార్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఆత్మను తెలిపేలా సచివాలయం, అమరజ్యోతి మధ్య తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆ ప్రాంతాన్ని పవిత్ర భూమిగా మార్చాలనే సదాశయంతో కేసీఆర్ డిజైన్‌ను రూపొందించారని తెలిపారు. ఈ స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టాలని 2023 జూన్, జూలైలోనే కేసీఆర్ ప్లాన్ చేశారని, ఎకరం కంటే ఎక్కువ స్థలంలో అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం రెండు వైపులా ఫౌంటెయిన్లు, ప్లాజా ఏర్పాటు చేయాలని భావించారని గుర్తుచేశారు. ల్యాండ్ స్కేపింగ్, పోలీస్‌స్టేషన్, ఫుడ్ కోర్ట్స్, బస్‌స్టాప్ కట్టాలని అనుకున్నారని, డిజైన్లు కూడా సిద్ధమయ్యాక ఎన్నికల కోడ్ రావడంతో సాధ్యం కాలేదని చెప్పారు.

> తెలంగాణ తల్లిని అవమానించి అయినా సోనియా మెప్పు పొందాలని రేవంత్‌రెడ్డి ఆతృతపడుతున్నడు. అందుకే తెలంగాణకు ఏమాత్రం సంబంధం లేని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సచివాలయం, అమరజ్యోతి మధ్యన పెట్టిండు.
>
> - వేముల ప్రశాంత్‌రెడ్డి

> అమరజ్యోతిని ప్రారంభించి ఏడాది గడిచినా సందర్శకులకు అనుమతిస్తలేరు. అమరుల త్యాగాలను ప్రజలకు తెలియకుండా చేస్తున్నరు. కేసీఆర్ నిర్మించారన్న కారణంతోనే అంబేద్కర్ విగ్రహం వద్ద ఫొటో గ్యాలరీని ఎవరూ సందర్శించకుండా తాళం వేశారు.
>
> - వేముల ప్రశాంత్‌రెడ్డి

అమరుల త్యాగం ప్రజలకు తెలియకుండా అడ్డు

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎందరో అసువులు బాసారని, వారిని నిత్యం స్మరించుకునేలా సచివాలయం ఎదురుగా అమరజ్యోతిని మూడున్నర ఎకరాల్లో ఏర్పాటు చేశామని వేముల వివరించారు. హైదరాబాద్ వచ్చే పర్యాటకులు, విదేశీయులు, ఢిల్లీలో బాపు ఘాట్, రాజ్ ఘాట్ తరహా దీన్ని సందర్శించి నివాళులర్పించేలా రూపొందించారని చెప్పారు. 2.88 లక్షల చదరపు అడుగుల్లో ఆరు ఫ్లోర్లతో నిర్మించినట్టు తెలిపారు. అమరుల ఫొటోలు, వారి జ్ఞాపకాలు, మీటింగ్ హాల్, క్యాంటిన్ తదితరాలు ఉండేలా ప్రణాళిక చేశామని, ప్రపంచంలో ఇలాంటి నిర్మాణాలు మూడే ఉన్నాయని చెప్పారు. ఒకటి చికాగో బీన్, రెండోది దుబాయ్ మ్యూజియం, మూడోది అమరవీరుల జ్యోతి అని, ఆ రెండింటి కంటే అద్భుతంగా అమరజ్యోతిని రూపొందించామని వివరించారు. నిరంతరం వెలిగే జ్యోతిలా వారి త్యాగాలు తెలంగాణ సమాజం గుండెల్లో వెలుగుతూనే ఉండాలని ఇలా నిర్మించినట్టు చెప్పారు. దాన్ని ప్రారంభించి ఏడాది గడిచినా ఇంతవరకు సందర్శకులకు అనుమతి ఇవ్వడంలేదని, అమరుల త్యాగాలను ప్రజలకు తెలియకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అమరుల కుటుంబాలను రెచ్చగొట్టి, వారిని రాజకీయంగా వాడుకున్నారని, రేవంత్‌రెడ్డి భేషజాలకు పోకుండా ఒకసారి అమరవీరుల జ్యోతిని సందర్శించాలని, సందర్శకులను అనుమతించాలని సూచించారు.

> కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేయ్యడం సీఎం రేవంత్‌రెడ్డి తరం కాదు.. కేసీఆర్ కట్టిన సెక్రటేరియట్, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రేవంత్‌రెడ్డి కూర్చుంటున్నడు. కేసీఆర్ చేసిన మంచిని కొనసాగించవద్దని రేవంత్‌రెడ్డి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నడు.
>
> - వేముల ప్రశాంత్‌రెడ్డి

కేసీఆర్ నిర్మించారనే ఫొటో గ్యాలరీకి తాళం

తెలంగాణ ఏర్పాటుకు కారణమైన రాజ్యాంగాన్ని రాసిన బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని 125 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేశామని ఇది ప్రపంచంలోనే అతి పెద్దదని వేముల గుర్తుచేశారు. సందర్శకులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు అంబేద్కర్ గురించి తెలిపే అన్ని ఏర్పాట్లు చేశామని, భావితరాలు స్ఫూర్తి పొందేలా హైదరాబాద్ నడిబొడ్డున నెక్లెస్‌రోడ్‌లో నెలకొల్పామని చెప్పారు. ఫొటో గ్యాలరీ కూడా ఏర్పాటు చేశామని, కేసీఆర్ నిర్మించారన్న కారణంతో దీనికి తాళం వేశారని ఆక్షేపించారు. అంబేద్కర్ జయంతి రోజున కూడా రేవంత్‌రెడ్డి అక్కడికెళ్లి నివాళులర్పించలేదని తెలిపారు. ప్రభుత్వ పరంగా ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని, కనీసం పూలదండ కూడా వేయలేదని, ప్రజలను అనుమతించలేదని మండిపడ్డారు.

కేసీఆర్ ఆనవాళ్లను చెరిపెయ్యలేరు

కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేయ్యాలని రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, కానీ అది సాధ్యం కాదని వేముల స్పష్టంచేశారు. కేసీఆర్ కట్టిన సెక్రటేరియట్, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రేవంత్‌రెడ్డి కూర్చుంటున్నారని గుర్తుచేశారు. కేసీఆర్ చేసిన మంచిని కొనసాగించవద్దని రేవంత్‌రెడ్డి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ తల్లి గౌరవాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. కేసీఆర్ కట్టించిన అన్నింటినీ వాడకంలోకి తేవాలని లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరుబాట తప్పదని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి నియంతృత్వాన్ని, అరాచకాలను మేధావులు, బుద్ధిజీవులు ఖండించాలని కోరారు.

తెలంగాణ ఆత్మాభిమానంపై దెబ్బ

కాంగ్రెస్‌లో ప్రతిష్ఠ కోసమే రాజీవ్ విగ్రహం

ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ అధిష్ఠానం అడుగులకు మడుగులొత్తుతూ పార్టీలో ప్రతిష్ఠ పెంచుకునేందుకే సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, తెలంగాణ ఉద్యమం, చరిత్ర, సంస్కృతితో ఎలాంటి సంబంధంలేని రాజీవ్ విగ్రహాన్ని పెట్టి తెలంగాణ ప్రజల ఆత్మాభిమానంపై దెబ్బకొట్టారని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. ప్రజల మనోభావాలకు విరుద్ధంగా సచివాలయం ఎదుట రాజీవ్ విగ్రహాన్ని పెట్టి పరోక్షంగా ఆయనను కూడా రేవంత్ అవమానించాడని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోనియా గాంధీని బలిదేవత అని తిట్టిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ఆమె మెప్పుకోసం రాజీవ్ విగ్రహం ఏర్పాటు చేసే ఎత్తుగడవేశారని ఆరోపించారు. 'తెలంగాణ తల్లి విగ్రహాన్ని బీఆర్ఎస్ ఏర్పాటు చేయలేదు అంటున్న ముఖ్యమంత్రీ.. స్వరాష్ట్ర ఉద్యమం నుంచి ప్రతి గ్రామం, ప్రతి రాస్తాలో మేం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించినం' అని గుర్తుచేశారు. ఉమ్మడి పాలన ముగిసిన సందర్భంగా తెలంగాణ సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించాలనుకున్నామని, ఇందుకు ప్రణాళికలు కూడా పూర్తయ్యాయని, ఎన్నికల కోడ్ కారణంగా ప్రక్రియ ఆగిపోయిందని తెలిపారు. ఎవరెన్ని చెప్పినా రాజీవ్‌గాంధీ విగ్రహం తెలంగాణ ప్రజల కండ్లలో నలుసులా మిగిలిపోతుందని ఎద్దేవాచేశారు.

గాంధీలు దూరం

మొదటిపేజీ తరువాయి...

దీపాదాస్ మున్షీ తప్ప ఏఐసీసీ నుంచి ప్రతినిధులు కూడా హాజరు కాలేదంటున్నారు. దీనినిబట్టి రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణను ఢిల్లీ పెద్దలు లైట్ తీసుకున్నారని అర్థమవుతున్నదని అన్నారు.

నాలుగైదు సార్లు పిలిచినా..

సీఎం రేవంత్‌రెడ్డి గత తొమ్మిది నెలల్లో 21సార్లు ఢిల్లీ వెళ్లి వచ్చారు. ఈ క్రమంలో రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణకు రావాలని ప్రత్యేకంగా నాలుగైదు సార్లు రాహుల్ గాంధీని, సోనియాగాంధీని ఆహ్వానించారని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. సీఎం పలుమార్లు ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా కూడా ఈ విషయాన్ని చెప్పారు. కానీ వారు ఎప్పుడూ సానుకూలంగా స్పందించలేదన్న ప్రచారం జరుగుతున్నది. వాస్తవానికి సచివాలయం ముందు విగ్రహం ఏర్పాటుపై ఢిల్లీ పెద్దలు మొదటి నుంచీ అసంతృప్తితో ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకోసం గుర్తించిన స్థలంలో రాజీవ్ విగ్రహం పెడుతుండటంపై ఫిర్యాదులు వెల్లువెత్తాయని, పార్టీలోనూ భిన్న స్వరాలు వినిపించాయని, దీంతో ప్రజల సెంటిమెంట్‌కు వ్యతిరేకంగా వెళ్తున్నామనే భావన వారిలో ఏర్పడిందని చెప్పుకుంటున్నారు. దీనికితోడు పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలం కావడంతో సంబంధాలు కూడా దెబ్బతిన్నాయని అంటున్నారు. అందువల్లనే విగ్రహావిష్కరణకు పిలిచినా సోనియా, రాహుల్, ప్రియాక రాలేదని చెప్తున్నారు.

సందట్లో సడేమియా మాదిరిగా!

ఢిల్లీతో దెబ్బతిన్న సంబంధాలను తిరిగి గాడిలో పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. దీనికి రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణను వేదికగా చేసుకుందామని భావించారని అంటున్నారు. ఆగస్టు 20న రాజీవ్ గాంధీ జయంతి. అప్పటికే విగ్రహం పనులు పూర్తయ్యాయి. కానీ బూమరాంగ్ అయ్యిందని చర్చ జరుగుతున్నది. తాను పిలిచినా ఢిల్లీ పెద్దలు వచ్చే అవకాశం లేకపోవడం, విగ్రహావిష్కరణతో కొత్తగా వచ్చే మైలేజీ లేకపోవడం.. పైగా వేరే రోజుల్లో విగ్రహావిష్కరణ జరిపితే గాంధీ కుటుంబం ఎందుకు రాలేదన్న ప్రశ్నలు ఎదురవుతాయన్న ప్రశ్నల నేపథ్యంలో సోమవారాన్ని ఎంపిక చేసుకున్నట్టు చర్చ జరుగుతున్నది. సోమవారం మిలాద్ ఉన్ నబీ పండుగ జరుపుకొంటున్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా సోమవారం, మంగళవారం వినాయక నిమజ్జనాల హడావుడి ఉంటుంది. వరుసగా నాలుగు రోజులుగా సెలవులు రావడంతో ప్రజల దృష్టి ప్రభుత్వంపై లేదు. ఈ సందర్భంలోనే సందట్లో సడేమియా మాదిరిగా విగ్రహావిష్కరణ చేశారని చెప్పుకుంటున్నారు.